సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

ఆదివారం । 7 । జనవరి । 2024



ఇక.. తల్లుల చెంతకే

భక్తులు మొక్కుగా సమర్పించే ఎత్తు బంగారం (బెల్లం) కన్వేయర్ బెల్ట్ ద్వారా నేరుగా అమ్మవార్ల గద్దెల పైకి చేరేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. - 8లో▸



ఆ మందులను నియంత్రించాలి

నాణ్యత లేని, నాసిరకం దగ్గు మందులను నియంత్రించాలని ఇండియా నేషనల్ కమిటీ సభ్యులు ఔషధ నియంత్రణ శాఖ జేడీని కోరారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం $28^0/18^0$

వాతావరణం

ఉష్ణోగ్రతలు తగ్గుతుండడంతో జిల్లాలో ఉదయం చలి ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి వేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

సీఎంఆర్‌కు గడువు నెలాఖరు

కాజీపేట: మిల్లర్ల నుంచి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సేకరణకు ఈనెల 31 వరకు గడువు పెంచుతూ.. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ 30లోపు రైస్ మిల్లర్లు సీఎంఆర్ బియ్యం ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికే నాలుగు దఫాలుగా కేంద్ర ప్రభుత్వం సీఎంఆర్ రైస్ ఇచ్చేందుకు మిల్లర్లకు అవకాశం కల్పించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మిల్లర్లు చేసిన విజ్ఞప్తి మేరకు మొదటి సారి మరో నెల గడువు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 2022–23 సంవత్సరానికి వానకాలం యాసంగికి సంబంధించిన సీఎంఆర్ ఇచ్చేందుకు జనవరి 31 వరకు గడువు పొడిగించింది. దీని తర్వాత ఎలాంటి గడువులు ఉండవని ప్రభుత్వం పేర్కొంది.

సెంట్రల్ వర్సిటీలో ఆర్ట్స్ కళాశాల విద్యార్థికి సీటు



కేయూ క్యాంపస్: ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాలలో బీఏ హెచ్‌ఈపీ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థి లావణ్య లహరినాయుడు పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీలో సీటు సాధించింది. పీజీ కోర్సు ఎంఏ హిస్టరీలో సీటు సాధించినందుకు ఆకళాశాల ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య శనివారం విద్యార్థిని సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య జి.హనుమంతు, అధ్యాపకులు డాక్టర్ అంజన్‌రావు, శ్రీధర్ కుమార్‌లోథ్, భిక్షపతి, తిరుణహరిశేషు, రమేశ్, రాంబాబు, చారి, సంజీవ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కంపెనీలో ప్రవేశాలకు ఎంపికలు

కాశిబుగ్గ: బెంగళూరు ఆర్మీ బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీ, మద్రాస్ ఇంజనీర్ గ్రూప్ సెంటర్‌లో బాలుర ప్రవేశాలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌ఓ సత్యవాణి శనివారం తెలిపారు. బాక్సింగ్, హాకీ, స్విమ్మింగ్, సెయిలింగ్ తదితర క్రీడల్లో ఫిబ్రవరి 5 నుంచి 8 వరకు కేవీ మద్రాస్ ఇంజనీర్ గ్రూప్, సెంటర్ స్పోర్ట్స్ గ్రౌండ్ బెంగళూరులో ప్రవేశాల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 8 నుంచి 14 ఏళ్లు, 14 నుంచి 16 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న బాలురు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఫిబ్రవరి 5 ఉదయంలోగా.. రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 95673 45347 (స్విమింగ్), 78927 66021(బాక్సింగ్), 70193 97105(సెయిలింగ్), 72047 93183(హాకీ) క్రీడాకారులు నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

9న జాబ్‌మేళా

కాళోజీ సెంటర్ : నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈనెల 9న వరంగల్ ములుగు రోడ్డు సమీపంలోని ఐటీఐ ప్రాంగణంలో ఉన్న జిల్లా ఉపాధి అధికారి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎస్.మాధవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాల కోసం 99599 05034 నంబర్‌లో సంప్రదించాలని ఆమె సూచించారు.

ఓటర్ల జాబితా ముసాయిదా విడుదల

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లా ఓటర్ల జాబితా ముసాయిదాను డీఆర్‌ఓ వైవీ గణేశ్ శనివారం కలెక్టర్ కార్యాలయంలో వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో విడుదల చేశారు. జిల్లాలో 487 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 5,10,407 ఓటర్లున్నారు. వరంగల్‌లో కలెక్టర్ ప్రావీణ్య జాబితా విడుదల చేశారు. జిల్లాలో 791 పోలింగ్ కేంద్రాల పరిధిలో 7,62,230 మంది ఓటర్లున్నారు.

ట్రాఫిక్ ఎస్సై సస్పెన్షన్

వరంగల్ క్రైం: హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ఎస్సై డేవిడ్‌ను సస్పెండ్ చేస్తూ.. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఓ వాహనదారుడి నుంచి డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలతో ఏఆర్‌కు అటాచ్ చేసి, అనంతరం విచారణ చేసి సస్పెండ్ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత అధికారిపై తీసుకున్న మొదటి క్రమశిక్షణ చర్య ఇదే.

ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్‌గా పవన్‌కుమార్

వరంగల్ క్రైం: ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పవన్‌కుమార్‌ను నియమిస్తూ వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 2012 బ్యాచ్‌కు చెందిన పవన్‌కుమార్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా మహబుబాబాద్, పెద్ద వంగర, మరిపెడ, హసన్‌పర్తి, కొడకండ్ల, మట్టెవాడ స్టేషన్లలో పనిచేశారు. 2022లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది ఆసిఫాబాద్‌లో విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు.

అయోధ్య అక్షింతలు.. రామయ్య ఆశీస్సులు!

ఓరుగల్లులో హారతిచ్చి స్వీకరిస్తున్న కుటుంబాలు

- శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిణీ
- ఈ నెల 1నుంచి మొదలు.. 15వ తేదీ వరకు కొనసాగింపు
- ఇంటింటికీ తిరుగుతున్న ఐదుగురు సభ్యుల బృందం
- అక్షింతలు, అయోధ్య చిత్రపటం, ఆహ్వానపత్రిక అందజేత
- ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 35 శాతం కుటుంబాలకు చేరవేత

సండే స్పెషల్

(వరంగల్ డెస్క్)

ఉమ్మడి ఓరుగల్లు రామనామ జపం చేస్తోంది. అయోధ్య రాముడి చెంత విశేష పూజలు అందుకున్న అక్షింతలు ఇంటింటికీ చేరుతున్నాయి. జైశ్రీరాం అంటూ భక్త బృందం ఊరూవాడా తిరుగుతోంది. సాక్షాత్తు ఆ రాముడే తమ ఇంటికి వచ్చినట్లు భక్తులు భావించి హారతిపట్టి అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు స్వీకరిస్తున్నారు. పుణ్యకార్యంలో తాము భాగస్వాములమవుతున్నామని ఆనందపడుతున్నారు. అసలు అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలకు ఉన్న పవిత్రత, ఉమ్మడి జిల్లాలో ఒక ఉద్యమంలా సాగుతున్న కార్యక్రమ విశేషాలు, రాముడి ప్రాణప్రతిష్ఠ రోజు ఆలయాల్లో ఏర్పాట్లు తదితర విశేషాలే ఈ వారం సండే స్పెషల్.

అయోధ్యలోని రామజన్మభూమి ఆలయ ప్రాణప్రతిష్ఠ ఈనెల 22న జరగనుంది. ఈ మహాకార్యంలో దేశప్రజలంతా భాగస్వాములయ్యేందుకు కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అయోధ్యలో బాలరాముడి వద్ద పూజించిన అక్షింతల వితరణ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈకార్యక్రమం ఈనెల ఒకటో తేదీన ప్రారంభమైంది. 15వ తేదీ వరకు ప్రతి ఇంటికీ తిరిగి అక్షింతలు అందజేయనున్నారు. ఈ అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగిస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు మొత్తం 65 క్వింటాళ్ల అక్షింతలు వచ్చాయి. వాటిని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ జిల్లా కమిటీల ద్వారా మండలాలకు, అక్కడి నుంచి గ్రామాలకు చేరవేస్తున్నారు.



ప్రతి ఇల్లూ ఒక అయోధ్య కావాలి

ప్రతి ఇల్లూ ఒక అయోధ్య కావాలన్న ఉద్దేశంతో ఇంటింటికీ అక్షింతల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. అన్ని ప్రాంతాల్లో సంచాలన సమితుల ద్వారా అక్షింతలు చేరుతున్నాయి. ఎక్కడైనా అయిపోతే జిల్లా కమిటీ ద్వారా పంపిస్తున్నాం. భక్తులు ఎంతో ఆనందంగా అక్షింతలు స్వీకరిస్తున్నారు. శ్రీరాముడు ఇంటికే వచ్చి ఇస్తున్నట్లు భావిస్తున్నారు. ఇదో పుణ్యకార్యం. ఇందులో మేం భాగస్వాములు కావడం పూర్వ జన్మ సుకృతం.

- నేలకొండ భాస్కర్‌రావు, శ్రీరాం ఉదయ్‌కుమార్, శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సహ సంయోజక్‌లు

సంచాలన సమితుల ద్వారా వితరణ

అక్షింతల పంపిణీని చేపట్టిన శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ జిల్లా, మండల, గ్రామ స్థాయిలో సంచాలన సమితులను ఏర్పాటు చేసింది. సమితిలో ఐదుగురు సభ్యులు ఉన్నారు. మిగతా హిందూ సంస్థలు కూడా ఈ ట్రస్ట్ కింద పనిచేస్తున్నాయి. వారు గ్రామాల్లో ఆధ్యాత్మిక భావన కలిగిన వారితో కలిసి ఇంటింటికీ తిరుగుతూ.. అక్షింతలు అందజేస్తున్నారు.

22న ఆలయాల్లో భారీ స్క్రీన్లు

ఈ నెల 22న అయోధ్యలో రాముడి ప్రాణప్రతిష్ఠ జరుగుతున్న సమయంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ప్రసాద వితరణ ఏర్పాటు చేస్తున్నారు. ఆలయాల్లో భారీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు అయోధ్యలో జరిగే ఆలయ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలను లైవ్‌లో చూసే అవకాశం కల్పిస్తున్నారు.

అక్షింతల పవిత్రత ఏంటంటే..

బృందం వచ్చే ముందే భక్తులు అక్షింతలు కలిపి పెట్టుకుంటున్నారు. కలశం నుంచి వచ్చిన అక్షింతలు తీసి అందులో వేస్తే అవి కూడా పవిత్ర అక్షింతలు అవుతాయి. వీటిని దేవుడి గదిలో దాచిపెట్టి శుభకార్యాలు, పుట్టిన రోజు, మంచి కార్యక్రమాలు చేసేటప్పుడు మీద వేసుకుంటే శుభం కలుగుతుందని విశ్వసిస్తున్నారు. మొదట ఈనెల 22న రామజన్మభూమి ఆలయ ప్రాణప్రతిష్ఠ రోజు ఇంటిల్లిపాది అక్షింతలు వేసుకోవాలని గుడిబండల్ ఆలయ అర్చకుడు తెలిపారు.

అక్షింతల వితరణ ఇలా..

సంచాలన సమితి సభ్యులు ప్రతీ రోజు ఉదయమే సమీప ఆలయం నుంచి బృందంగా బయల్దేరుతున్నారు. బృందంలో కలశ ప్రముఖ్‌తోపాటు మరో నలుగురు ఉంటున్నారు. అక్షింతల కలశాన్ని ప్రముఖ్ తలపై ధరించి బృందం ముందు భాగంలో నడుస్తుండగా సభ్యులు శ్రీరామనామ జపం చేస్తూ ఇంటింటికీ తిరుగుతున్నారు. ఇంటికి వచ్చిన వారికి భక్తులు నీళ్ల ఆరబోసి హారతిపట్టి స్వాగతం పలుకుతున్నారు. హారతిపళ్లెంలో కలశంనుంచి అక్షింతలు తీసి వేస్తున్నారు. దీంతోపాటు రామజన్మభూమి చిత్రపటం, సూచనపత్రం అందజేస్తున్నారు. అయోధ్య ప్రాముఖ్యత, రాముడి విశిష్టతను వివరిస్తున్నారు. ఇలా ప్రతీ ఇల్లూ తిరుగుతూ అందజేస్తున్నారు. ఇప్పటి వరకు ఒక్క వరంగల్ మహానగరంలో 1.35 లక్షల కుటుంబాలకు అక్షింతల వితరణ చేశారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 16 లక్షల కుటుంబాలకు అందజేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 35 శాతం పూర్తి చేసినట్లు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నిర్వాహకులు 'సాక్షి'తో తెలిపారు.





పూర్వజన్మ సుకృతం

అయోధ్య అక్షింతలు పట్టుకోవడం, ఇంటింటికీ తిరిగి పంచే అవకాశం రావడం పూర్వ జన్మ సుకృతం. దైవ సేవా కార్యక్రమాలకు తరచూ వెళ్తుంటాను. ఐదు రోజులుగా ఈ సేవా కార్యక్రమంలో తిరుగుతున్నాను. రాముడి విశిష్టతను భక్తులకు తెలిపి అక్షింతలు అందజేస్తుంటే వారినుంచి మంచి స్పందన వస్తోంది. ఆనందంగా స్వీకరిస్తున్నారు.

- ఎ.రజని, సంచాలన సమితి సభ్యురాలు



ఇలాంటి సేవ మళ్లీ రాదు

శ్రీరాముడికి సేవ చేయడం అంటే పెద్ద పుణ్యకార్యం. జీవితంలో ఇలాంటి అవకాశం మళ్లీ రాదు. ఆరు రోజులుగా వాడవాడలా తిరుగుతున్నాం. భక్తులు ఎదురేగి నీళ్లారబోసి స్వాగతం పలుకుతున్నారు. ఎంతో భక్తిశ్రద్ధలతో అక్షింతలు స్వీకరిస్తున్నారు. ఈ బృందంలో ఉండే అవకాశం కల్పించినందుకు నా జీవితం ధన్యమైంది.

- పెండ్లి రాధిక, సంచాలన సమితి సభ్యురాలు



రాముడే మా ఇంటికి వచ్చినట్లుంది

అయోధ్యకు మనం పోలేం. మా ఇంటికి అక్షింతలు వస్తాయను కోలేదు. శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ వారు పంపిణీ చేయడం బాగుంది. ఆ రాముడే మా ఇంటికి వచ్చినట్లుంది. అక్షింతలు దాచుకున్నాం. ఏదైనా శుభకార్యం, పిల్లల పుట్టిన రోజున ఆ అక్షింతలు వేసుకుంటాం. అంతా శుభం కలుగుతుందని మా నమ్మకం.

- బోయిని విజయ్‌కుమార్, గుడిబండల్



హనుమకొండ గుడిబండల్ ఏరియాలో అయోధ్య అక్షింతలు అందజేస్తున్న భక్త బృందం

నగర సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రచించండి

- దశ, దిశను మార్చే ప్రాజెక్టులు యుద్ధప్రాతిపదికన చేపట్టండి
- మంత్రి కొండా సురేఖ



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్ అర్బన్: మహా నగర సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రచించాలని రాష్ట్ర దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖ కొండా సురేఖ ఆదేశించారు. శనివారం హనుమకొండలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, జిల్లాకు చెందిన వివిధ విభాగాల ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నగరాభివృద్ధికి ఇప్పటి వరకు స్మార్ట్ సిటీ, ముఖ్య మంత్రి హామీ నిధులు, జనరల్ ఫండ్ కింద చేపట్టిన అభివృద్ధి పనులు ఏయే దశల్లో ఉన్నాయని ఆరా తీశారు. పూర్తయిన పనులు, పురోగతిలో ఉన్నవి, చేపట్టాల్సినవి తదితర అంశాలపై సీరియస్‌గా దృష్టిసారించాలన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గానికి సంబంధించి, బల్దియా, 'కుడా', ఆర్‌అండ్‌బీ, ఎలక్ట్రికల్, డీఆర్డీఏ, అటవీ, ఇరిగేషన్ల ద్వారా రానున్న ఐదేళ్లలో ప్రణాళికలు అందజేయాలన్నారు. పెండింగ్ పనులు, కొనసాగుతున్న పనుల్ని సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. నగరానికి చక్కని ఫేస్ లిఫ్ట్ ఇవ్వడానికి చేపట్టాల్సిన పనులైన వరంగల్ బస్ స్టేషన్ నిర్మాణం, కాళోజీ కళాక్షేత్రం, భద్రకాళి ఆలయ మాఢ వీధులు, ఇన్నర్ రింగ్ రోడ్‌ల పనుల్ని యుద్ధ ప్రాతిపాదికన చేపట్టాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. సమావేశంలో 'కుడా' సీపీఓ అజిత్ రెడ్డి, డీఆర్డీఓ సంపత్‌రావు, బల్దియా ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్ఓ రాజేశ్, ఆర్డీఓ వాసుచంద్ర, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి, 'కుడా' ఈఈ భీమ్‌రావు, సెక్రటరీ మురళి, బల్దియా ఈఈలు శ్రీనివాస్, రాజయ్య, సంజయ్‌కుమార్, అధికారలు జితేందర్‌రెడ్డి, డీఆర్డీఓ సంపత్‌రావు పాల్గొన్నారు.

గ్రేటర్‌కు మరోసారి ఓడీఎఫ్ డబుల్ ప్లస్

- బహిరంగ మల, మూత్ర విసర్జన రహితంగా గుర్తింపు
- హర్షం వ్యక్తం చేసిన మేయర్

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగరం మరోమారు బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత నగరంగా 'ఓడీఎఫ్ డబుల్ ప్లస్'ను సాధించింది. కేంద్ర పట్టణ, గృహ నిర్మాణ శాఖ దేశ వ్యాప్తంగా పట్టణాలను, నగరాలను గుర్తించింది. అందులో భాగంగా గ్రేటర్ వరంగల్‌కు వరుసగా 2020, 2021, 2022, 2023 ఓడీఎఫ్ డబుల్ ప్లస్ దక్కింది. ఓడీఎఫ్‌పై ప్రతీ ఏటా కేంద్ర మంత్రిత్వ శాఖ ప్రాథమిక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. దీనిపై అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరిస్తోంది. అంతేకాకుండా కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నియమించిన క్వాలిటీ కంట్రోల్ కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలిస్తున్నారు. నగరంలో పబ్లిక్ టాయిలెట్లు, ఇళ్లల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు, ఆధునిక విధానాల టాయిలెట్లు, శాస్త్రీయ పద్ధతిలో మల, మూత్ర శుద్ధీకరణ, సెప్టిక్ ట్యాంకులు ఖాళీ చేయడం, మానవ రహిత సేవలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. అమ్మవారిపేటలో మానవ వ్యర్థాల నిర్మూలన ప్లాంట్ 25 కేఎల్‌డీ ప్లాంట్ ఉండగా.. మరికొన్ని ప్లాంట్ల పనులు పురోగతిలో ఉన్నాయి. ఈనేపథ్యంలో నిబంధనల ప్రకారం అన్నీ పక్కాగా ఉన్నాయని గుర్తించిన క్వాలిటీ కంట్రోల్ సభ్యుల నివేదిక మేరకు కేంద్ర ప్రభుత్వం సర్టిఫికెట్లను జారీ చేసింది.

మేయర్ సుధారాణి హర్షం

నగరానికి ఓడీఎఫ్‌లో నాలుగోసారి సర్టిఫికెట్ దక్కడంపై మేయర్ గుండు సుధారాణి హర్షం వ్యక్తం చేశారు. నగర పరిధిలో ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ, ఆధునిక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. మురుగునీటి శుద్ధీకరణ (ఎస్‌టీపీ), మానవ వ్యర్థాల శుద్ధీకరణ (ఎఫ్ఎస్‌టీపీ) చేపట్టిన విధానాలు, గృహాల నుంచి మలాన్ని క్రమపద్ధతిలో సేకరించి, సెప్టిక్ ట్యాంకర్ల ద్వారా మూడేళ్లకోసారి శుభ్రపర్చేలా చర్యలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అత్యుత్తమ నిర్వహణకు నగరాన్ని ఎంపిక చేసి సర్టిఫికెట్ అందజేస్తున్నట్లు మేయర్ తెలిపారు. ఇదే స్ఫూర్తితో 2023 స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో మెరుగైన ర్యాంక్ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల సహకారంతో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు పేర్కొన్నారు.

17లోగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తవ్వాలి



మాట్లాడుతున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్ అర్బన్: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ఈనెల 17లోగా పూర్తి చేయాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల నమోదుపై అధికారులు సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ పాల్గొని దిశా నిర్దేశం చేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వివరాల నమోదులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్లు అనిసుర్ రషీద్, రవీందర్ యాదవ్, ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్ఓ రాజేశ్, 'కుడా' సీపీఓ అజిత్‌రెడ్డి, సెక్రెటరీ విజయలక్ష్మి, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం తదితరులు పాల్గొన్నారు.

వెల్లువెత్తిన దరఖాస్తులు

- మహా నగర ప్రజల నుంచి విశేష స్పందన
- మొత్తం 2,86,820 నమోదు

వరంగల్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అభయహస్తం ఆరు గ్యారంటీల ప్రజాపాలనకు మహానగర ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజలు పెద్ద ఎత్తున సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు సమర్పించారు. గత నెల 28 నుంచి ప్రారంభమైన కార్యక్రమం శనివారం సాయంత్రంతో ముగిసింది. 8 రోజుల పాటు సాగిన ఈకార్యక్రమానికి మొత్తం 2,86,820 దరఖాస్తులు వచ్చాయి. మొదట్లో ఒకటి, రెండు రోజుల్లో దరఖాస్తు పత్రం కోసం ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆతర్వాత అందరికీ సరిపడా అందడంతో సాఫీగా 66 డివిజన్ కేంద్రాల్లోని నిర్ణీత కేంద్రాల్లో అందజేశారు. దరఖాస్తుల స్వీకరణకు జనరల్ 6, మహిళల కోసం 3, దివ్యాంగులకు 1 చొప్పున కేంద్రాలను ఏర్పాటు చేయడంతో స్వీకరణ ప్రక్రియ సులభమైంది. రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, విలీన గ్రామాల్లో ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, అధికారులు, సిబ్బంది ఆయా ప్రజాపాలన కేంద్రాలను పరిశీలించి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ప్రజాపాలనకు ఆరు స్కీంల కోసం 2,07,896 దరఖాస్తులు రాగా.. రేషన్ కార్డుల కోసం 38,029, జనరల్ ఫిర్యాదులు 40,895గా ప్రజలు కేంద్రాల్లో అందజేశారు.

తేదీ	స్కీం	జనరల్	రేషన్ కార్డులు	మొత్తం
28-12	18,516	1,393	0	19,909
29-12	31,960	3,008	2,020	36,988
30-12	36,316	4,498	4,375	45,189
02-01	33,353	5,124	5,114	43,591
03-01	26,838	5,640	5,609	38,087
04-01	22,023	5,767	5,650	33,440
05-01	19,724	6,570	6,494	32,788
06-01	19,166	8,895	8,767	36,828
	2,07,896	40,895	38,029	2,86,820

ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం సిద్ధం

ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కాజీపేట: ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. కాజీపేటలోని 62వ డివిజన్ సోమిడి కమ్యూనిటీ హాల్, 63వ డివిజన్ విష్ణుపురి వాటర్ ట్యాంక్ ఆవరణలో శనివారం ప్రజాపాలన సభకు హాజరై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోలేకపోయిన వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బావుసింగ్,



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

కార్పొరేటర్లు జక్కుల రవీందర్‌యాదవ్, విజయశ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్లు గుంటి కుమారస్వామి, సుంచు అశోక్, కాంగ్రెస్ నాయకులు ఎండీ అంకూస్, క్రాంతి భరత్, పి.సంతోష్, పి.ఆంజనేయులు, అజ్గర్, శివ, బంక సంపత్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా


34 కిలోల గంజాయి పట్టివేత.. ఐదుగురి అరెస్ట్



కాశిబుగ్గ : వరంగల్ రైల్వేస్టేషన్‌లో అక్రమంగా తరలిస్తున్న 34 కిలోల గంజాయి, తరలిస్తున్న ఐదుగురిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వరంగల్ జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ యూసుఫ్‌గూడకు చెందిన ఆనంద్‌కుమార్, కోళ్ల సందీప్‌యాదవ్, శివం వర్మ, దండుగ కిషోర్, షిండే అఖిల్‌లు మిత్రులు. చెడు వ్యసనాలకు బానిసైన వీరు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే లక్ష్యంతో గంజాయిని తీసుకొచ్చి నగరంలో విక్రయించేందుకు సిద్ధపడ్డారు. ఈ క్రమంలో విశాఖపట్నంలో 34 కిలోల ఎండుగంజాయిని కొనుగోలు చేసి ప్రత్యేకంగా ప్యాకింగ్ చేసి షోల్డర్ బ్యాగుల్లో పెట్టుకుని ఓ రైలులో వరంగల్‌కు చేరుకున్నారు. అక్కడినుంచి శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో హైదరాబాద్ వెళ్లేందుకు స్టేషన్‌లోని కాజీపేట వైపు గల 2, 3వ ప్లాట్‌ఫాం వద్ద అనుమానాస్పదంగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి దొరకడంతో వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆర్పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు జీఆర్పీ సీఐ నరేష్ కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. గంజాయి విలువ సుమారు రూ.8,54,000 ఉంటుందని సీఐ తెలిపారు.

ఇక.. తల్లుల చెంతకే

నేరుగా అమ్మవార్ల గద్దెల పైకి ఎత్తుబంగారం..
- ఈ జాతరలో కన్వేయర్ బెల్ట్ ఏర్పాటుకు అధికారుల ప్రణాళిక
- భక్తులకు తప్పనున్న తిప్పలు
- మంత్రి సీతక్కకు వివరించిన అధికారులు



కన్వేయర్ బెల్ట్ ఏర్పాటుపై అధికారులు రూపొందించిన నమూనా

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరలో భక్తులు మొక్కుగా సమర్పించే ఎత్తు బంగారం (బెల్లం) కన్వేయర్ బెల్ట్ ద్వారా నేరుగా అమ్మవార్ల గద్దెల పైకి చేరేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఏటా మహాజాతరలో భక్తులు మొక్కుగా ఎత్తు బంగారం చెల్లిస్తారు. క్యూలైన్‌లో ఎత్తుబంగారం తీసుకువచ్చి తల్లుల గద్దెలపై విసురుతారు. ఈ క్రమంలో బెల్లం సరిగా గద్దె పైకి చేరకపోవడం, గద్దె సమీపంలో ఉన్న భక్తులకు గాయాలవడం, గద్దెల పరిసరాల్లో భక్తుల కాళ్ల కింద నలిగి పరిసరాలు పూర్తి అపరిశుభ్రంగా మారుతుంటాయి. ఈ నేపథ్యంలో ఈ సమస్యలు పరిష్కరించడానికి దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈసారి ఎత్తు బంగారం నేరుగా గద్దెల పైకి చేరేలా వినూత్నంగా కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా భక్తులకు తిప్పలు తప్పనున్నాయి.

తొలి ప్రయోగంగా సమ్మక్క గద్దె పైకి..

కన్వేయర్ బెల్ట్‌ను తొలి ప్రయోగాత్మకంగా భక్తులపై నుంచి సమ్మక్క గద్దె వరకు ఏర్పాటు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. క్యూలైన్లలో ఉన్న భక్తులు మొక్కుగా సమర్పించనున్న ఎత్తు బంగారం కన్వేయర్ బెల్ట్‌పై వేయగానే నేరుగా సమ్మక్క గద్దె పైకి చేరుతుంది. గద్దె పై నుంచి మరో కన్వేయర్ బెల్ట్ ద్వారా గద్దెల ప్రాంగణంలో ఒక నిర్దేశిత స్థలంలోకి ఆ బంగారం (బెల్లం) తరలించేలా అధికారులు ఏర్పాట్లకు సన్నాహాలు చేస్తున్నారు. ఈసారి జాతరలో తొలిసారి వినియోగిస్తున్న కన్వేయర్ బెల్ట్ ప్రయోగం సక్సెస్ అయితే మరో జాతర వరకు సారలమ్మ గద్దె పై వరకు కూడా బెల్ట్ ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. జాతర సమయంలో ఏదైనా సాంకేతిక లోపం తలెత్తినా భక్తులు నేరుగా పాత పద్ధతి ద్వారా అమ్మవార్ల గద్దె పైకి బెల్లం సమర్పించుకునేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. కాగా, కన్వేయర్ బెల్ట్‌కు సుమారు రూ.60 నుంచి రూ.70 లక్షల వరకు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు శనివారం దేవాదాయ శాఖ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు మేడారం అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు పనులను పరిశీలించారు.

మంత్రికి కన్వేయర్ బెల్ట్ ఏర్పాట్లను వివరించిన అధికారులు..

మేడారంలో పర్యటించిన మంత్రి సీతక్కకు కన్వేయర్ బెల్ట్ ఏర్పాటుపై దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతారావు, ఈఓ రాజేంద్రం, ఇంజనీరింగ్ అధికారులు వివరించారు. నిర్ణయం బాగా ఉందని, భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా సక్సెస్ చేస్తే ఫలితం ఉంటుందని మంత్రి తెలిపారు. ఈ కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు నిర్ణయాన్ని పూజారులతో చర్చించి వారికి ట్రయల్ నమూనా చూపించాలన్నారు. వారి అభిప్రాయం మేరకు నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

మేడారం భక్తులను క్షేమంగా చేరవేద్దాం

- టీఎస్ ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ వినోద్ కుమార్



ఉద్యోగులకు భోజనం వడ్డిస్తున్న కరీంనగర్ జోన్ ఈడీ వినోద్‌కుమార్, ఆర్ఎం శ్రీలత

హన్మకొండ: మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు భక్తులను క్షేమంగా చేరవేద్దామని టీఎస్ ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ సి.వినోద్ కుమార్ అన్నారు. శనివారం హనుమకొండ రాంనగర్‌లోని టీఎస్ ఆర్టీసీ హనుమకొండ డిపోలో వనభోజనాల కార్యక్రమం జరిగింది. ఆర్టీసీ ఈడీ సి.వినోద్ కుమార్, వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలత, అధికారులు.. ఉద్యోగులకు స్వయంగా భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమానికి ఈడీ వినోద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఫిబ్రవరిలో జరిగే మేడారం జాతరకు భక్తులు లక్షలాదిగా తరలివస్తారన్నారు. వీరందరిని క్షేమంగా చేరవేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జాతర విజయవంతంలో ఆర్టీసీదే కీలక భూమిక అన్నారు. ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించిన తర్వాత ఆర్టీసీకి ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ఉద్యోగులపై భారం పెరిగినా అంకితభావంతో పని చేస్తున్నారని అభినందించారు. ఉచిత బస్సు ప్రయాణంపై అధ్యయనం చేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఉచిత ప్రయాణంలో ఉద్యోగులపై భారం పెరిగిన మాట వాస్తవమేనన్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు.వరంగల్ రీజియన్‌కు 148 బస్సులు కావాలని అడిగారని, వీటిని త్వరలో అందించనున్నట్లు చెప్పారు. రోజు పని ఒత్తిడిలో ఉండే ఉద్యోగులకు ఆటవిడుపు కోసం యాజమాన్యం వనభోజనాల కార్యక్రమం చేపట్టిందన్నారు. వరంగల్ ఆర్ఎం శ్రీలత మాట్లాడుతూ మహిళలకు ఉచిత ప్రయాణంతో ఎన్నో ప్రయోజనాలు కలుగుతున్నామన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేద మహిళలు ఉచిత బస్సు ప్రయాణంతో హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లి మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు పొందుతున్నారని, ఓ సర్వేలో తేలిందని వివరించారు. ఇది ఆర్టీసీకి ఎంతో గర్వకారణమన్నారు. అనంతరం ఈడీ వినోద్ కుమార్ మొక్క నాటి నీరు పోశారు. కార్యక్రమంలో వరంగల్ రీజియన్ డిప్యూటీ ఆర్ఎంలు మాధవరావు, కేశరాజు భానుకిరణ్, డిపో మేనేజర్ బి.ధరంసింగ్, జి.సురేష్, వంగల మోహన్‌రావు, ఈఈ భాస్కర్, సూపర్ వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయాలను ప్రక్షాళన చేయాలి



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గాదె దయాకర్

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని ఉన్నత విద్య, యూనివర్సిటీలను ప్రక్షాళన చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించినట్లు కాంగ్రెస్ ప్రచార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్, కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ గాదె దయాకర్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం ప్రచారం చేసేందుకు తనకు తెలంగాణ రాష్ట్ర ప్రచార రాష్ట్ర కోఆర్డినేటర్‌గా అవకాశం ఇచ్చినందుకు రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ రెండున్నరేళ్లగా వీసీ పాలన అస్తవ్యస్తంగా ఉందని, వెంటనే ఉన్నత విద్యకు న్యాయం చేయాలని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని గాదె దయాకర్ తెలిపారు.

ఆన్‌లైన్‌లో నమోదును పూర్తి చేయండి

హసన్‌పర్తి: ప్రజాపాలన దరఖాస్తులను ఈనెల 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్త ఆదేశించారు. హసన్‌పర్తి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను శనివారం అదనపు కలెక్టర్ రాధికా గుప్త పరిశీలించారు. పొరపాట్లు లేకుండా దరఖాస్తుల్ని జాగ్రత్తగా ఆన్‌లైన్ చేయాలని డాటా ఎంట్రీ ఆపరేటర్‌కు సూచించారు. ప్రస్తుతం గంటకు నాలుగు అప్లికేషన్‌లు కూడా ఆన్‌లైన్ కావడం లేదని, సర్వర్ కెపాసిటీని పెంచాలని ఆపరేటర్లు కోరారు. నమోదు కోసం లాగిన్‌లు పెంచాలన్నారు. ప్రస్తుతం 14 లాగిన్‌లు అందుబాటులో ఉంచినట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. పంచాయతీరాజ్‌తో పాటు విద్యాశాఖకు బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రహీం, ఎంపీఓ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

మహాజాతరను ఘనంగా నిర్వహిస్తాం

- అధికారులు నిబద్ధతతో పని చేయాలి
- ఈనెలాఖరు కల్లా పనులన్నీ పూర్తి
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు/ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరను ఘనంగా నిర్వహిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. శనివారం మేడారంలో ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపడతామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహకారంతో జాతర అభివృద్ధికి రూ. 75 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. భక్తులకు మరిన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి అధికారుల నుంచి ప్రతిపాదనలు తీసుకుంటున్నామన్నారు. పూజ కార్యక్రమాలకు విఘాతం కలగకుండా ఆదివాసీ సంస్కృతికి ఆటంకం కలగకుండా జాతరను అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. వ్యర్థాలు ఎక్కడక్కడ పడితే అక్కడ వేయొద్దని భక్తులను కోరారు. జాతరలో విధులు నిర్వర్తించే అధికారులు నిజాయితీ, నిబద్ధతగా ఉండాలన్నారు. మీడియా ప్రతినిధులు, భక్తులు అధికారులు, ప్రభుత్వానికి సూచనలు ఇవ్వాలన్నారు. జాతరకు మంత్రులు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించేందుకు త్వరలో ఐటీడీఏ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఆహ్వానంపై సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. మహాజాతరకు దేశం నలుమూలల నుంచి కోట్లాది మంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో వారు ఇబ్బందులు పడకుండా జాతర తేదీల పోస్టర్లను విడుదల చేస్తామన్నారు. కేంద్రం ప్రభుత్వం మేడారం జాతరను జాతీయ పండుగా ప్రకటిస్తుందని ఆశిస్తున్నానన్నారు. రాష్ట్రపతి హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా మేడారం జాతరకు జాతీయ హోదా కల్పించాలని విజ్ఞప్తి చేయగా ఆమె సానుకులంగా స్పందించారన్నారు. జాతరకు ఇంకా 40 రోజుల సమయం మాత్రమే ఉందని, ఈ నేపథ్యంలో ఈనెలాఖరుకల్లా పనులన్నీ పూర్తియ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

జాతర పనుల పరిశీలన..

మేడారం జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఆయాశాఖల ద్వారా చేపట్టి పనులను మంత్రి సీతక్క అధికారులతో కలిసి పరిశీలించారు. వెంగ్లాపూర్, కొత్తూరు, నార్లాపూర్ చింతక్రాస్, మేడారం ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్డు పనులు పరిశీలించి అధికారులతో మాట్లాడారు. పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. వారం రోజుల లోపు రోడ్డు పనుల పురోగతి కనిపించాలని ఆదేశించారు. మేడారంలో ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం సమ్మక్క, సారలమ్మలను దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీఓ అంకిత్, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, అడిషనల్ ఎస్పీ సదానందం, తదితరులు పాల్గొన్నారు.



సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న మంత్రి

జూనియర్ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి..

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని మంత్రి సీతక్కను కళాశాల అధ్యాపకులు కోరారు. శనివారం మేడారానికి వచ్చిన మంత్రి సీతక్కను కళాశాల ప్రిన్సిపాల్ రాంపాక అవిలయ్య కలిసి సన్మానించారు. కళాశాలలోని సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కళాశాలలో నెలకొన్న తాగునీరు, మరుగుదొడ్లు, బాలికల హాస్టల్, తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. లైబ్రేరియన్ రాములు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కొమ్మాల సంధ్య, అధ్యాపకులు కిషన్, శ్వేత పాల్గొన్నారు.

అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్య సస్పెండ్

- కేయూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ
- 14 రోజుల రిమాండ్. చంచల్‌గూడ జైలుకు తరలింపు

కేయూ క్యాంపస్: లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్.కిష్టయ్యను సస్పెండ్ చేస్తూ శనివారం రాత్రి రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. వరంగల్ కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన పాల వ్యాపారి పెండెం రాజేందర్‌కు చెందిన పెండింగ్ బిల్లులు క్లియర్ చేసేందుకు కిష్టయ్య ఈ నెల 5వ తేదీన రూ.50వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన విషయం తెలిసిందే. ఏసీబీ అధికారులు కిష్టయ్యను అరెస్టు చేసి శనివారం హైదరాబాద్ ఏసీబీ కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఏసీబీ అధికారుల నుంచి వచ్చిన రేడియో మెస్సేజ్ ఆధారంగా శాఖాపరమైన చర్యల్లో భాగంగా తెలంగాణ సివిల్ సర్వీసెస్ (సీసీఏ) రూల్స్ 1991 ప్రకారం, అలాగే , వీసీ తాటికొండ రమేష్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్యను సస్పెండ్ చేసినట్లు రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు తెలిపారు. తదుపరి శాఖాపరమైన చర్యలు కోర్టు ఉత్తర్వులపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- 5 తులాల బంగారం, రూ.లక్షా పదివేల నగదు అపహరణ
- బొల్లికుంటలో ఘటన

ఖిలా వరంగల్ : ఓ కుటుంబం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇల్లును గుల్ల చేశారు. ఈ ఘటన శనివారం మధ్యాహ్నం ఖిలా వరంగల్ మండలం బొల్లికుంటలో జరిగింది. గ్రామానికి చెందిన సోల్తి సాంబయ్య, అతడి కుమారుడు అశోక్ గౌడ్ ఒకే ఇంట్లో వేర్వేరు గదుల్లో నివాసం ఉంటున్నారు. ఐనవోలు మండలం పంథిని గ్రామంలో తన అల్లుడి ఇంట్లో జరిగిన అయ్యప్పడి పూజకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి చేరుకోగా తలుపు గడియ, బీరువా ధ్వంసమై కనిపించాయి. దీంతో చోరీ జరిగిందని గుర్తించిన అశోక్ వెంటనే మామునూరు పోలీసులు సమాచారం అందజేశారు. సీఐ క్రాంతికుమార్.. ఎస్సై కృష్ణవేణి,క్లూస్ టీమ్‌తో కలిసి ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనలో బీరువాలో భద్రపరిచిన 5 తులాల బంగారం, రూ.లక్షా పదివేల నగదు చోరీకి గురైందని బాధితులు సాంబయ్య, అశోక్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ క్రాంతికుమార్ తెలిపారు.

గురుకులంలో ప్రవేశాలకుదరఖాస్తు చేసుకోవాలి

ఏటూరునాగారం : భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లోని తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాల గురుకులం రీజినల్ కోఆర్డినేటర్ అగస్టిన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తరగతి చదువుతున్న గిరిజన బాలబాలికలు 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో ఈనెల 6 నుంచి 20వ తేదీలోపు మీసేవ కేంద్రాల్లో రూ. 100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని గిరిజన బాలబాలికల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని అగస్టిన్ కోరారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

ఏటూరునాగారం: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గిరిజన అభ్యర్థులకు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షలు 2023-24 (కానిస్టేబుల్) కోసం ఉచితంగా 45 రోజుల శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీఓ అంకిత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు ఎక్నాలెడ్జ్‌మెంట్, సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులు హనుమకొండలోని పీఈటీసీ ప్రిన్సిపాల్ కార్యాలయంలో ఈనెల 12లోపు అందించాలన్నారు. గతంలో గిరిజన సంక్షేమశాఖ ద్వారా శిక్షణ పొందిన అభ్యర్థులను పరిగణనలోకి తీసుకోమని తెలిపారు. మరిన్ని వివరాలకు 0870-3500644లో సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

- డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి



డీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కాళోజీ సెంటర్ : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వరంగల్ డీఈఓ కార్యాలయంలో శనివారం డీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పర్యవేక్షణ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని, విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అధ్యాపక జ్వాల ప్రధాన సంపాదకుడు ఎం.గంగాధర్, నాయకులు ఎం.బాలకుమార్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎ.గోవిందరావు, ప్రధాన కార్యదర్శి కె.యాకయ్య, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.సుదర్శనం, మహబూబాబాద్ జిల్లా బాధ్యులు భాస్కర్, కె.కొమ్మయ్యయ, బి.జాన్, ఎస్‌కే. సర్దార్, బాలాజీ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అలైన్‌మెంట్ ప్రకారం బోధన చేయాలి

కాళోజీ సెంటర్ : తొలిమెట్టు అలైన్‌మెంట్ ప్రకారం బోధన చేయాలని వరంగల్ డీఈఓ వాసంతి సూచించారు. వరంగల్ కృష్ణకాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం మండలస్థాయి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు పాఠశాల సముదాయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. నోడల్ ఆఫీసర్ అశోక్ కుమార్, ప్రధానోపాధ్యాయులు నర్సింహారావు, వెంకన్న, సీఆర్పీ సుకన్య ఉన్నారు.

బైక్‌పైకి దూసుకెళ్లిన లారీ..

ప్రైవేట్ స్కూల్ టీచర్ మృతి
- భీమారం సమీపంలో ఘటన
- మృతురాలిది ముంబాయి



సునయన సునీల్ సావంత్(ఫైల్)

హసన్‌పర్తి : హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారిపై భీమారం సమీపంలో ఘోర ప్రమాదం జరిగింది. ఓ లారీ.. ద్విచక్రవాహనంపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో బైక్ వెనుక కూర్చున్న ఓ ప్రైవేట్ స్కూల్ టీచర్ తీవ్రంగా గాయపడింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై సురేష్ కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని ముంబాయికి చెందిన సునయన సునీల్ సావంత్(27) భీమారంలోని స్కిల్ స్టోక్స్ ఇంటర్నేషనల్ పాఠశాలలో టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. సునయనతో పాటు మరికొంతమంది ఉపాధ్యాయులు భీమారంలో అద్దెకు ఉంటూ పాఠశాలకు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఇదే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న బిశ్వాంత్ చటర్జీతో కలిసి సునయన సునీల్ సావంత్ బైక్‌పై పాఠశాలకు బయలుదేరింది. బిశ్వాంత్‌చటర్జీ వాహనం నడుపుతుండగా, సునయన వెనుక కూర్చుంది. భీమారంలో వాహనంలో పెట్రోల్ పోసుకుని ముందుకు సాగారు. ఈ క్రమంలో వెనుక నుంచి వస్తున్న లారీ.. ద్విచక్రవాహనంపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో సునయన సునీల్ సావంత్ వెనుక టైర్ కింద చిక్కుకుంది. దీంతో తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం మృతి చెందినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. కాగా, బతుకుదెరువు కోసం నగరం వచ్చిన సునయన సునీల్ సావంత్ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడం పలువురిని కలచివేసింది. సునయన సునీల్ సావంత్ మృతి పట్ల ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు, స్కిల్‌స్టోక్ డైరెక్టర్ ఎర్రబెల్లి అనూప్‌కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి సంతాపం తెలిపారు. కాగా, ఈ ఘటనపై సమాచారం అందుకున్న మృతురాలి కుటుంబసభ్యులు ముంబాయి నుంచి హైదరాబాద్ చేరుకున్నారు.

గుండెపోటుతో ప్రయాణికుడి మృతి

మహబూబాబాద్ రూరల్ : ఓ ప్రయాణికుడు గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో జరిగింది. ఖమ్మం జిల్లా తిరుమలయపాలెం మండలం తెట్టెలపాడుకు చెందిన వంగూరి రాంబాబు (30) భార్య నవ్య, ఇద్దరు కూతుళ్లతో కలిసి హైదరాబాద్ వెళ్లేందుకు మహబూబాబాద్ రైల్వేస్టేషన్ చేరుకున్నాడు. గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్లేందుకు టికెట్ కొనుగోలు చేశాడు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి పైనుంచి రెండో ప్లాట్‌ఫామ్ వద్దకు నడుచుకుంటూ వస్తూ గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. వెంటనే నవ్య.. చికిత్స నిమిత్తం రాంబాబును ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందాడని ధ్రువీకరించారు.